క్లుప్తంగా

నేడు మదమంచిపాటి వీరాంజనేయస్వామి తిరునాళ్ల

వినుకొండ: మండలంలోని మదమంచిపాటి తిరునాళ్ల మహోత్సవం నేడు నిర్వహించనున్నారు. 638 సంవత్సరంలో స్వయంభూగా వెలసిన స్వామి వారికి గత 78 సంవత్సరాలుగా స్వామి వారి తిరునాళ్ల మహోత్సవాన్ని భక్తులు అంగరంగవైభవంగా నిర్వహిస్తున్నారు. తిరునాళ్ల సందర్భంగా పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించనున్నారు. ఆర్టీసీ బస్సు సర్వీసులను నడపనున్నారు. ప్రభలు ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. తిరునాళ్ల అనంతరం ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహించనున్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరాలు

శావల్యాపురం: శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ వారి సౌజన్యంతో ఉచిత కంటి వైద్యశిబిరాలు మండలంలోని ఇర్లపాడు, పోట్లూరు, శావల్యాపురం, వేల్పూరు, బొందిలిపాలెం, తదితర గ్రామాల్లో బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా శావల్యాపురం కంటి వైద్య శిబిరంలో జెడ్పీటీసీ సభ్యురాలు పారా హైమావతి పాల్గొని మట్లాడుతూ కంటి వైద్యశిబిరాలను పేదలందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈశిబిరాల్లో కంటి వైద్య నిపుణులు వైద్య సేవలు అందించి శుక్లాములు ఆపరేషన్లు గుర్తించి ఉచితంగా చేయిస్తామన్నారు.

ఉపసర్పంచ్ పదవికి రాజీనామా

శావల్యాపురం: మండలంలోని ముండ్రువారిపాలెం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ పాపసాని విజయలక్ష్మి వ్యక్తిగత కారణాలతో తన పదవికి రాజీనామా చేసినట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య బుధవారం తెలిపారు. ఇందుకుగాను ఉప సర్పంచ్ లిఖిత పూర్వకంగా సమాచారాన్ని ఎంపీడీవో కార్యాలయంలో అందజేసినట్లు తెలిపారు. ఉప సర్పంచ్ రాజీనామా లేఖను జిల్లా పంచాయతీ అధికారికి సమాచారం పంపినట్లు ఎంపీడీవో తెలిపారు.

ఎండోస్కోపితో ఇనుపమేకు తొలగింపు



బాలిక మింగిన ఇనుపమేకు



డాక్టర్ ముప్పాళ్ల బలరామకృష్ణ

చిలకలూరిపేట: రెండేళ్ల బాలిక పొరపాటున మింగిన ఇనుప మేకును ఎండోస్కోపి విధానంలో తొలగించిన సంఘటన స్థానిక జానకీ నర్సింగ్ హోమ్ లోని బలరామకృష్ణ లివర్ అండ్ గ్యాస్ట్రో సెంటర్‌లో బుధవారం జరిగింది. పట్టణంలోని గుర్రాల చావిడి ప్రాంతానికి చెందిన రెండేళ్ల బాలిక పొరపాటున చిన్న ఇనుప మేకు మింగి బాధపడుతుండగా ఆసుపత్రికి తెచ్చారు. పరీక్షించిన గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్య నిపుణుడు డాక్టర్ ముప్పాళ్ల బలరామకృష్ణ తేజశ్వి ఆపరేషన్ లేకుండా కడుపులో జీర్ణం కాని ఆహారం మధ్య ఉన్న ఇనుపమేకును ఎండోస్కోపి ద్వారా బయటకు తీశారు. మేకు మింగిన 20 నిమిషాలలోపు ఆసుపత్రికి తీసుకువచ్చిన బాలిక తల్లిదండ్రులను డాక్టర్ తేజశ్వి అభినందించారు. 45 నిమిషాలు గడిచి ఉంటే చికిత్స అందించటం కష్టమయ్యేదని వివరించారు.

ప్రమాదాల నివారణకు భాగస్వాములు కావాలి



నరసరావుపేటటౌన్: ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నరసరావుపేట అగ్నిమాపక శాఖ అధికారి ఎం.వి. సుబ్బారావు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మూడవ రోజు పట్టణంలోని మహిళా శిశు సంక్షేమ శాఖ సీడీపీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, అంగన్‌వాడీ ఆయాలు గృహిణులకు నివాస గృహాలలో జరిగే ఎల్‌పీజీ గ్యాస్ అగ్ని ప్రమాదాలు ఎల్క్ట్రిసిటీ అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి స్క్రీన్‌పై డెమో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్ బి. కృష్ణారెడ్డి, డీసీపీఓ డి. శౌరిరాజు, నరసరావుపేట సీడీపీఓ సి.హెచ్.ఉమా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఆరాధనోత్సవాలు

నాదెండ్ల: గణపవరం సినిమా హాల్ రోడ్డులో ఉన్న శ్రీ కృష్ణాంజనేయ స్వామి ఉపాసకులు అచల దాసునాయన మఠం 86వ ఆరాధనోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటూ జరిగే ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు దాసునాయన, ఆయన శిష్యుల సమాధులకు పూజలు చేశారు. భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. పెదనందిపాడుకు చెందిన గురువు వీఎస్ఆర్ ఆంజనేయులు ప్రవచనాలు చేశారు. 18న భారీ అన్నదాన కార్యక్రమం జరగనుంది. కార్యక్రమాలను కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

రైతుల పాలిట క(వ)డగండ్లు

- తగ్గనున్న దిగుబడులు
- ఆదుకునే వారి కోసం రైతన్న ఎదురుచూపు
- నష్టపరిహారమైనా ఇప్పించాలంటూ వేడుకోలు



విరిగిన వరి కంకులు పరిశీలిస్తున్న అధికారులు



రాలిన వడ్ల గింజలు

నూజెండ్ల: సాధారణంగా దిగుబడులు తగ్గి ఓ వైపు రైతు నష్టపోతుంటే ప్రకృతి ప్రకోపం మరోవైపు రైతు వెన్ను విరుస్తోంది. మండలంలో ఆదివారం వడగండ్ల వాన, బుధవారం కురిసిన భారీ వర్షానికి రైతులు తల్లడిల్లిపోయారు. ఆరుగాలం పండించిన పంట దెబ్బతినడంతో వారంతా కన్నీరు మున్నీరవుతున్నారు. వడగండ్లకు వరి కంకులు విరిగి వడ్లు రాలిపోగా, భారీ వర్షానికి నీరు నిలవడంతో మినుము ఉరకెత్తిపోతోంది.

గాంధీనగర్, తిమ్మాపురం, సాయినగర్, నూజెండ్ల గ్రామాల్లో బోర్ల క్రింద దాళ్వా వరి, మినుము సాగు చేస్తున్నారు. వరి కోత దశలో ఉండటంతో నష్టం అధికంగా ఉంది. గతంలో ఎకరాకు 40 బస్తాల దిగుబడి రాగా ప్రస్తుతం 20 నుంచి 25 బస్తాలకే పరిమితమయ్యే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. మినుము పంటలో వర్షపు నీరు నిలబడటంతో పైరు దెబ్బతిని దిగుబడి వచ్చే అవకాశం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దెబ్బతిన్న పంటలను వ్యవసాయధికారులు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. పంట నష్టం నివేదికను ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు అధికారులు తెలిపారు.

బీమా సౌకర్యం అందేనా?

పంట నష్టపోయిన రైతులకు బీమా సౌకర్యం దక్కేనా అని రైతులు మదన పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా పొందే రైతులందరికీ బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించేది. దీంతో రైతులు విపత్కర పరిస్థితుల్లో ఎటువంటి భారం పడకుండానే నష్టపరిహారానికి అర్హత పొందేవారు. ప్రస్తుతం ఆ ప్రీమియం సొమ్ము రైతులు చెల్లిస్తేనే అర్హత ఉండటం.. ఆ ప్రకారం ఎంత మంది అందుతుందనేది అనుమానమే.

వర్షానికి రైతులు పరుగులు



వర్షానికి నేలవాలిన దాళ్వా వరి

రొంపిచర్ల: మండలంలో మంగళవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. రాత్రి వేళ వర్షం రావటంతో రైతులు పొలం బాట పట్టారు. కల్లాల్లో ఉన్న మిర్చి, మొక్కజొన్న, ధాన్యం రాశులను వర్షానికి తడవకుండా టార్పలిన్ పట్టలు కప్పుకున్నారు. కోతకు సిద్ధమైన వరి మొక్కజొన్న పైర్లు నేలవారాయి. వర్షం కొద్దిపాటిది అవ్వటంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. వర్షం కారణంగా బుధవారం నిర్వహించాల్సిన వరి, మొక్కజొన్న హార్వెస్టింగ్ పనులు నిలిచాయి. ఏదిఏమైనా ఈ తరుణంలో కురిసిన అకాలవర్షం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది.

పెట్టుబడి కూడా రాదయ్యా!



వరి పంట చేతికి అంది వచ్చే సమయానికి వడగండ్ల వానకు వడ్లు రాలిపోయాయి. దిగుబడులు 25 బస్తాలకు మించదు. పెట్టుబడులు సైతం వచ్చే అవకాశం లేదు.

–నాగిరెడ్డి, రైతు, గాంధీనగర్.

విజిలెన్స్ కమిటీ, ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

హోటళ్ల నిర్వాహకులకు పలుసూచనలు



పల్నాడురోడ్డులోని ఓ టీషాపులో తనిఖీ చేస్తున్న ఫుడ్‌సేఫ్టీ, విజిలెన్స్ కమిటీ సభ్యులు

నరసరావుపేట: స్థానిక పల్నాడురోడ్డులోని హోటళ్ళలో బుధవారం జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ లక్ష్మీనారాయణ, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు పిల్లి యజ్ఞనారాయణ తనిఖీలు నిర్వహించారు. టీస్టాల్‌లో వినియోగిస్తున్న లూజ్ పాలు, టీపొడి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపారు. ఫ్రిడ్జ్‌లో ఉన్న పెరుగు, మజ్జిగా ప్యాకెట్లు, కూల్‌డ్రింక్స్, బాదంపాల ముగింపు తేదీలను తనిఖీ చేశారు. అలాగే హోటళ్ళలో పరిసరాల శుభ్రత పాటించాలని, ఫ్రిడ్జ్‌లను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేసుకోవాలని, డస్ట్‌బిన్ ఏర్పాటు చేసి వాడిన టీ కప్పులను అందులో వేసేలా చూడాలని, టీ తయారు చేసే పాత్రలను ప్రతిరోజు శుభం చేయాలని హోటల్ యజమానులకు సూచించారు. అలాగే వినియోగించే వస్తువుల ముగింపు గడువు ప్రతిరోజు పరిశీలించి గడువు ముగిసిన వస్తువులను తొలగించాలని సిబ్బందికి సూచించారు.

ఈ సందర్భంగా పల్నాడు జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ లక్ష్మీనారాయణ మీడియాతో మాట్లాడుతూ ప్రజలు అనారోగ్యంపాలు కాకుండా ఉండేందుకు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు జిల్లాలో వివిధ ప్రాంతాలలో తనికీలు నిర్వహించి నిబంధనలు పాటించని హోటళ్ళు, షాపులపై కేసులు రాయటం జరిగిందని, అందులో భాగంగా నరసరావుపేట పట్టణంలో తనిఖీలు నిర్వహించామని అన్నారు.

పల్నాడు జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు పిల్లి యజ్ఞ నారాయణ మాట్లాడుతూ త్వరలో జిల్లాలోని అన్ని హోటళ్లు, రెస్టారెంటులు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో కూడా తనిఖీ చేయడం జరుగుతుందని, నిబంధనలు పాటించని వారిపై కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఏపీ వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర క్రియాశీల కార్యదర్శి కె.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఏకపక్షంగా స్వర్గపురి రేట్లు పెంపు!

- కాల్పులు, పూడ్పులకు రూ.2 వేలు పెంపు
- తనకేమి తెలియదంటున్న కమిషనర్



స్వర్గపురి శ్మశాన వాటికలో రేట్లు పెంచుతూ వేలాడదీసిన ఫ్లెక్సీ

నరసరావుపేట: మేము అధికారంలోకి వస్తే అరచేతిలో వైకుంఠం చూపిస్తామంటూ ప్రజలకు ఎన్నో ఆశలు చూపిన కూటమి నాయకులు తీరా అధికారం చేపట్టగానే తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. చివరకు చచ్చిన వారిని కూడా వదలకుండా రేట్లు పెంచి గుంజుకుంటున్నారు. స్వర్గపురిలో అంత్యక్రియలకు అమాంతం రూ.2 వేలు పెంచి వసూలు చేస్తున్నారు. పట్టణంలో మూడు శ్మశాన వాటికలు ఉండగా అందులో స్వర్గపురి–1 గుంటూరు రోడ్డులో ఉండగా, రెండోది రావిపాడు రోడ్డు, మూడవది ఎస్ఎస్ఎన్ కళాశాలకు పక్కగా ఉంది. స్వర్గపురి ఒకటిలో కాల్పులకు రూ.4,500లు, పూడ్పులకు రూ.4 వేలు చార్జీలు ఈనెల 9వ తేదీ వరకు వసూలు చేశారు. అయితే పదో తేదీ నుంచి రూ.2 వేలు పెంచుతూ కమిటీ నిర్వాహకులు శ్మశాన వాటిక వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. సంబంధిత అధికారులైన మున్సిపల్ కమిషనర్, ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తున్న ఆర్డీవోలకు ముందస్తుగా తెలియచేయకుండానే కమిటీకి చెందిన వ్యక్తులు నిర్ణయం తీసుకున్నట్లుగా తెలియవచ్చింది. దీనిపై మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావును వివరణ కోరగా పెంచిన విషయం తమకేమి తెలియదని, తమ దృష్టికి రాలేదని పేర్కొన్నారు. అయితే ఆ శ్మశాన వాటికకు ఒక కమిటీ ఉందని, స్వర్గపురి బాగోగుల కోసం ఆ కమిటీకి చెందిన వ్యక్తులే నిర్ణయం తీసుకున్నారన్నారు.

ప్రజావేదికలో సమస్యల ఏకరువు

- అధికారులు అందుబాటులో ఉండటం లేదు
- లిఫ్ట్ ఇరిగేషన్‌లో పంపుసెట్లు పనిచేయడం లేదు



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

నాదెండ్ల: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అర్జీదారులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అతిథిగా హాజరయ్యారు. రెవెన్యూ సమస్యలపై పలువురు గళం విప్పారు. ఎన్నిసార్లు అర్జీలు అందించినా సమస్యలు పరిష్కారం కావడం లేదని వాపోయారు. ముఖ్యంగా నాదెండ్ల, గణపవరం, సాతులూరు గ్రామస్తులు రెవెన్యూ సమస్యలపై మాట్లాడారు. గణపవరం గ్రామానికి చెందిన నాయకుడు వలేటి హిమంతరావు మాట్లాడుతూ జాతీయ రహదారిపై ఆర్చి సెంటర్‌లో డివైడర్ వద్ద లైట్లు వెలగటం లేదని, వీటిని పునరుద్ధరించాలని, లిఫ్ట్ ఇరిగేషన్‌లో పంపుసెట్లు పని చేయకపోవటం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని, గ్రామంలో ఉపాధి హామీ పథకం పునరుద్ధరించాలని కోరారు. మండల సర్వేయర్‌పై పలువురు ఫిర్యాదులు చేశారు. సర్వే చేసిన అనంతరం సర్వే సర్టిఫికెట్లను అందించటం లేదని ఆరోపించారు. ఈనాం భూములు ఫిబ్రవరి వరకూ మీ భూమి వెబ్‌సైట్‌లో కనిపించాయని, మార్చి మొదటి వారం నుంచి అడంగలు, 1–బిలలో ఈనాం వివరాలు కనిపించటం లేదన్నారు. రీసర్వే అనంతరం తలెత్తిన భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

కార్యక్రమంలో ఎంపీపీ తలతోటి రాణి, సర్పంచ్ మొగిలి నాగలక్ష్మీ, తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీడీవో స్వరూపరాణి, సీడీపీవో శాంత కుమారి, నాయకులు బండారుపల్లి సత్యనారాయణ, నెల్లూరి సదాశివరావు, గంగా శ్రీనివాసరావు, వలేటి హిమంతరావు, నెల్లూరి పూర్ణచంద్ర రావు, నల్లమోతు హరిబాబు, విద్యుత్ శాఖ ఏడీఈ అశోక్, సీఐ సుబ్బనాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చిన్నారులకు బోధన ఉపకరణాలు వితరణ



శావల్యాపురం: స్థానిక భవిత సెంటరులో ప్రత్యేక అవసరాల కల్గిన చిన్నారులకు బోధన ఉపకరణాలు అందచేశారు. బండి గోపాలకృష్ణమూర్తి జన్మదినం సందర్భంగా కుటుంబ సభ్యులు ప్రత్యేక అవసరాల కల్గిన చిన్నారులకు అండగా ఉండి వారి భవిష్యత్‌కు ఉపయోగపడే విధంగా బోధన పరికరాలు అందజేయటం అభినందనీయమని ఆరంబ్ ఎడ్యూ పౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బిళ్ళా రాజారమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఈడీ ఉపాధ్యాయులు కె.జగన్‌మోహన్‌రెడ్డి, పార్వతి ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో కార్మికుడు మృతి

యడ్లపాడు: నూలుమిల్లులో అనుమానాస్పద స్థితిలో ఒరిస్సా కార్మికుడు మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామం భవన్ టెక్స్‌టైల్స్ నూలుమిల్లుకు ఒడిశా రాష్ట్రం భద్రక్ జిల్లా, జగన్నాథ్ ప్రసాద్ మండలం, దధిభమనపుర్ గ్రామానికి చెందిన భీంసేన్ మాలిక్ నాలుగేళ్ల కిందట ఉపాధి పనులు నిమిత్తం వలస వచ్చాడు. అప్పటి నుంచి తిమ్మాపురం హైవే రహదారి పక్కనే ఉన్న భవనం టెక్స్‌టైల్ మిల్లులో స్పిన్నింగ్ సైడర్‌గా పనిచేస్తూ అక్కడే క్వార్టర్లలో ఒంటరిగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం డ్యూటీకి రమ్మని పిలిచేందుకు మిల్లు సిబ్బంది వెళ్లగా పూర్తి నీరసంగా ఉన్న భీంసేన్‌మాలిక్ (32) ను గమనించి యాజమాన్యానికి తెలిపారు. అనంతరం అతన్ని ఆస్పత్రికి తీసుకెళ్లాలని ప్రయత్నించేలోగా చనిపోయినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలికి వెళ్లి మృతదేహాన్ని చిలకలూరిపేట ఆస్పత్రికి తరలించారు. బుధవారం పోస్టుమార్టం నిర్వహించి చిలకలూరిపేట పట్టణంలోనే పురపాల సంఘం కార్మికులతో ఖననం చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐ టి.శివరామకృష్ణను వివరణ కోరగా మృతి సమాచారం తమకు తెలిసిన వెంటనే ఒరిస్సాలోని వారి భార్యకు తెలిపామని, కడచూపుకు రామంటూ అక్కడి నుంచి లెటర్ పంపించగా మిల్లు మేస్త్రిచే ఫిర్యాదు తీసుకుని, పోస్టుమార్టం, అంత్యక్రియల పనుల్ని బుధవారం నిర్వహించామని తెలిపారు. మృతి చెందిన తర్వాత గోప్యత, కుటుంబ సభ్యులు ఇక్కడికి వచ్చేందుకు నిరాకరించడంపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు విచారణలో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గ్యాస్ లీకై ఆరుగురికి గాయాలు



దగ్ధమైన వస్తువులు



గాయపడిన మహిళ

చిలకలూరిపేటటౌన్: టిఫెన్ సెంటర్లో గ్యాస్ సిలిండర్ లీక్ అవ్వడంతో ఆరుగురికి గాయాలై పెనుప్రమాదం తప్పిన సంఘటన పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. పట్టణంలోని భావనరుషి నగర్ మొదటిలైనులో జాలయ్య, వెంకటరమణ దంపతులు గత పదేళ్లగా చిన్నదుకాణం ఏర్పాటు చేసుకుని టిఫెన్ సెంటర్‌ను నడుపుతున్నారు. రోజు మాదిరిగానే దుకాణం తెరిచి గ్యాస్‌పొయ్యి వెలిగించే క్రమంలో రెగ్యులేటర్ వద్ద గ్యాస్‌లీక్ కావడంతో మంటలు వ్యాప్తి చెందాయి. గమనించిన స్థానికులు మంటల్ని అర్పేందుకు ప్రయత్నించగా వారికి మంటలు అంటుకుని గాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న చిలకలూరిపేట అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలికి చేరుకుని మంటల్ని అదుపులోకి తెచ్చారు. సిలిండర్ లోని గ్యాస్ అంతా అయ్యే వరకు పూర్తిగా మంటలు పెద్ద ఎత్తున రావడంతో దుకాణం, అందులోని వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. గాయాలపాలైన నిర్వాహకులిద్దరితో పాటు శ్రీనివాసరావు, సీతారావమ్మ, కోటేశ్వరరావు, ఆదిబాబులను పట్టణ ప్రభుత్వ ఆసుపత్రికి అగ్నిమాపక సిబ్బంది ప్రైవేటు వావనంలో తరలించారు.

కాలువకు మరమ్మతులు చేయించండి



డీఈకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వినుకొండ: మైనర్ ఇరిగేషన్ కాలువకు మరమ్మతులు చేయించాలని ఎన్ఎస్‌పీ డీఈకి ప్రజా సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. బ్రాహ్మణపల్లి రోడ్డు నుంచి నరసరావుపేట రోడ్డు వరకు ఒక కిలోమీటర్ పైగా కాలువ రెండు వైపులా కంపచెట్లు పెరిగి రహదారి లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే మరమ్మతులు చేయించి వర్షాకాలానికి ముందే రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి రెడ్డిబోయిన ప్రసన్నకుమార్, శ్రీనివాసరావు, లక్ష్మీరెడ్డి, శంకరావు పాల్గొన్నారు.

ఈ–గవర్నెన్స్‌తో సేవలు సులభతరం



ఈ-గవర్నెన్సు పై అవగాహన కల్పిస్తున్న సచివాలయ సిబ్బంది

నూజెండ్ల: ప్రభుత్వ సేవలను మరింత సులువుగా వేగంగా అందుకోవడానికి ఈ–గవర్నెన్సు సేవలు దోహదపడతాయని పంచాయతీ కార్యదర్శి జానీబాషా అన్నారు. మండలంలోని వి.అప్పాపురం గ్రామంలో బుధవారం ఇంటింటికీ మన మిత్ర కార్యక్రమం ద్వారా ప్రభుత్వ వాట్సాప్ సేవలపై గ్రామస్తులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది ప్రజల సెల్‌ఫోన్లలో 9552300009 నంబరు నమోదు చేసి సేవల వినియోగాన్ని వివరించారు. కార్యదర్శి జానీబాషా మాట్లాడుతూ పైన తెలిపిన నంబరుకు హాయ్ అని సందేశం పంపితే సేవల జాబితా వస్తుంది. అందులో కావల్సిన సేవలోకి వెళ్లి వివరాలు అందిస్తే అర్హులైన వారికి ధ్రువీకరణ పత్రాలు నిర్ణయించిన సమయంలో అందుకోవచ్చన్నారు. ఇప్పటి వరకూ 250 సేవలు అందుబాటులో ఉండగా జూన్ నాటికి వాటి సంఖ్య 500 పెరగనుందని అన్నారు. ఆయనతో పాటు వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రభాకర్, వెటర్నరీ అసిస్టెంట్ నితన్ ఉన్నారు.

విద్యార్థుల ఆత్మహత్యలు విషాదకరం



మాట్లాడుతున్న సుబ్బారావు

నాదెండ్ల: ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ఫెయిలైన అనేక మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం విషాదకరమని రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు చెప్పారు. సాతులూరు ఎస్సీ కాలనీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం మంచిది కాదని, వీటిని నివారించేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో మానసిక కెరియర్ గైడెన్స్ నిపుణత కలవారిని నియమించాలన్నారు. ప్రాథమిక స్థాయిలోనే సరైన నైపుణ్యం, తరగతులకు ప్రమోట్ కావటం, విద్యార్థుల సామర్థ్యాలు అంచనా వేయకుండా తల్లిదండ్రులు బలవంతంగా ఐఐటీ, నీట్, సివిల్ పోటీలు రాయాలని ఒత్తిడి తేవటం వంటి కారణాలతోనే ఆత్మహత్యలు చోటు చేసుకుంటున్నాయన్నారు. విద్యార్థుల అభిరుచిని పరిగణలోకి తీసుకుని ఆయా రంగాల్లో వారిని ప్రోత్సహించాలన్నారు. కుటుంబ పరమైన ఆర్థిక సమస్యలను ముందుంచి వారిపై ఒత్తిడి తేవటం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రసన్నకుమార్, అనిల్‌కుమార్, విజయ్, కె.అనిల్ ఉన్నారు.

వైద్యవృత్తిని దైవంలా భావించాలి



విద్యార్థులకు స్టెతస్కోప్‌లు అందిస్తున్న సుబ్బరాయగుప్త

నరసరావుపేట ఈస్ట్: వైద్యవృత్తిని దైవంలా భావించి ప్రజల మన్ననలు అందుకోవాలని శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల పాలకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త హితవు పలికారు. కళాశాలలో బుధవారం జనరల్ నర్సింగ్, బీఎస్సీ నర్సింగ్, ఫిజియోథెరపీ విభాగాల ఆధ్వర్యంలో ఫ్రెషర్స్‌డే ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా హాజరైన విజయకుమార్, సుబ్బరాయగుప్త మాట్లాడుతూ, వైద్య రంగంలో నర్సింగ్ విభాగం కీలకమైనదని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.ఎం.రేణుకా దేవి, జి.ఎన్.ఎం. ప్రిన్సిపల్ బి.నీల్ పీటర్, ఫిజియోథెరపీ ప్రిన్సిపల్ సిహెచ్.ధనలక్ష్మీ, ఏఓ ఏ.వి.ఎన్.గుప్త, అధ్యాపకులు పాల్గొన్నారు.

తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

చిలకలూరిపేట: విద్యార్థులు ఐఐటీ ఫౌండేషన్ తరగతులను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి చెప్పారు. ఏఎంజీ హైస్కూల్‌లో 6, 7, 8 తరగతులు చదువుతున్న విద్యార్థులకు బుధవారం ఐఐటీ ఫౌండేషన్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు మెమోంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. సామాన్య కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఐఐటీలలో సీట్లు సాధించాలన్న ఉద్దేశంతో ఏఎంజీ హైస్కూల్‌లో ఐఐటీ ఫౌండేషన్ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం కె.కృపాదానం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోండి

శావల్యాపురం: పోస్టల్ బీమా పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని వినుకొండ పోస్టల్ ఇన్‌స్పెక్టరు యం.వెంకట సురేష్ అన్నారు. బుధవారం స్థానిక సబ్ పోస్టాఫీసును సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సుకన్య సమృద్ధి యోజన పథకంలో భాగంగా 10 సంవత్సరాలోపు బాలికల తల్లిదండ్రులు ఈపథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రూ. 250 రూపాయలతో పోస్టల్ ఖాతాను ప్రారంభించి సంవత్సరానికి రూ. ఒక లక్ష 50 వేల పరిమితి వరకు పొదుపు చేసుకొవచ్చున్నారు. బాలికకు 21 సంవత్సరాల రాగానే పొదుపు చేసిన నగదు ఆధారంగా అదనంగా వడ్డీను కలిపి చెల్లింపులు జరుగుతాయన్నారు. శావల్యాపురం పోస్టు మాష్టరు షేక్ హసనయ్య తదితరులు ఆయన వెంట పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

శావల్యాపురం: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపుదలకు ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు అన్నారు. బుధవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 39 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, 1 నుంచి 10 తరగతుల వరకు విద్యార్థుల సంఖ్య పెంపుదలకు అందరు భాగస్వామ్యం కావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, వసతులు తదితరవన్నీ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులు సహకారంతో ప్రధానోపాధ్యాయులు తమ వంతు కృషి చేయాలన్నారు. ప్రతిరోజు నూతన అడ్మిషన్లు వచ్చేలా ఉపాధ్యాయులు బాధ్యత వహించాలన్నారు. ముఖ్యంగా అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారులందరూ 1వ తరగతిలో ఎంపీపీ స్కూల్లో చేరేలా తగు చర్యలు చేపట్టాలన్నారు. 24 మంది నూతన అడ్మిషన్లు ఇప్పటి వరకు జరిగినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంఈవో–2 పుసూలూరి లలితకుమారి ఉన్నారు.